శనివారం 18-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 338, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com


# ఈడీ, సీబీఐ సీజ్ చేసిన డబ్బు పేదలకే


## ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి

**ముందడుగు జాతీయం:**

దేశంలోని చాలా పార్టీల నేతల ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించి కోట్ల కొద్ది గుట్టలు గుట్టలుగా డబ్బులు స్వాధీనం చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఈడీని.. పావుగా వాడుకుని రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటుందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తూనే ఉంటాయి. ఈ క్రమంలోనే ఈడీ దాఖలు చేసిన కేసుల్లో శిక్ష పడిన కేసులు చాలా తక్కువ శాతమే ఉండటం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే ఈడీ స్వాధీనం చేసుకున్న డబ్బు గురించి అడిగిన ప్రశ్నకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆసక్తికరమైన సమాధానం చెప్పారు.



ఈడీని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి కేవలం దేశంలో ఉన్న ప్రతిపక్షాలకు చెందిన నేతలను మాత్రమే టార్గెట్ చేస్తోందని విపక్షాలు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తుండగా.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గట్టి కౌంటర్ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే కేంద్ర దర్యాప్తు సంస్థలు సమర్థవంతంగా.. పూర్తి స్వేచ్ఛతో పని చేస్తున్నాయని మోదీ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఈడీ, సీబీఐ లాంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు సోదాలు చేసి స్వాధీనం చేసుకున్న డబ్బును ఏం చేస్తారు అనే దానిపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేసిన వ్యక్తులు, సంస్థలు.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, కొందరు నేతలు, పార్టీల సహకారంతో అక్రమంగా దోచుకున్న డబ్బును సీజ్ చేస్తాయని తెలిపారు. అయితే ఇలా అక్రమంగా దోచుకున్న డబ్బును దేశంలో పేద ప్రజలకు చేర్చే ఆలోచన చేస్తున్నామని నరేంద్ర మోడీ వెల్లడించారు. దాని గురించి ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం న్యాయ సలహా కోరామని.. వారు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని మోడీ స్పష్టం చేశారు.

చార్ ధామ్ యాత్రలో రీల్స్ చిత్రీకరణ నిషిద్ధం

వివరాలు 3లో


# దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతుంది

- ప్రత్యర్థి పార్టీ నేతలు జైల్లో పెడుతున్నారు
- బిజెపిపై కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు

**ముందడుగు పంజాబ్:**



దేశంలో కొనసాగుతున్న నియంతృత్వ పాలన ఆమోదయోగ్యం కాదని, ప్రత్యర్థి పార్టీ నేతలందరినీ జైల్లో పెట్టారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ బిజెపిపై ఆరోపణలు గుప్పిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 75 ఏళ్లలో దేశంలో ఎన్నడూ చూడని నియంతృత్వ పాలన కొనసాగుతోందని కమలదళంపై ధ్వజమెత్తారు. అమృత్‌సర్‌లో మిగతా 2లో

# సున్నితమైన శరీర భాగాలపై కొట్టారు



- తనపై విచక్షణారహితంగా దాడి చేశారు
- వాంగ్మూలంలో స్వాతి సంచలన ఆరోపణలు

**ముందడుగు ఢిల్లీ:**

ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడికి పాల్పడిన ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు బిభవ్‌ను నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. అతడు తనపై విచక్షణారహితంగా భౌతిక దాడికి పాల్పడ్డాడని, సున్నితమైన శరీర భాగాలపై మిగతా 2లో




ప్రాణాంతకంగా మారిన హెపటైటిస్

వివరాలు 2లో


## భారత్ మసాల బ్రాండ్‌లపై మరో దేశం నిషేధం

వివరాలు 2లో





అందాల డాక్టరమ్మ..!

వివరాలు 4లో

ముందడుగు
శనివారం, 18-5-2024, హైదరాబాద్

## దేశంలో నియంతృత్వ పాలన
# కొనసాగుతుంది

**ముందడుగు పంజాబ్:**

ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన భాజపా పాలనపై మండిపడ్డారు.

అమృత్‌సర్‌లో పంజాబ్ ఆప్ కార్యకర్తలు, ఎమ్మెల్యేలతో సహా పార్టీ నాయకులను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో ఆప్ విజయం సాధించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ప్రత్యర్థులను ఇలా జైల్లో పెడుతుండటం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. భారత్ పరిస్థితిని రష్యాతో పోలుస్తూ మాట్లాడారు. ''రష్యాలో పుతిన్ తన ప్రత్యర్థి నాయకులందరినీ జైలుకు పంపడమో లేదా వారిని చంపడమో చేశారు. ఆపై ఎన్నికలు నిర్వహించి 87 శాతం ఓట్లు సాధించారు. ప్రతిపక్షమే లేనప్పుడు మీకు మాత్రమే ఓట్లు వస్తాయి'' అని భాజపాపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నన్ను జైల్లో పెట్టారు, మనీష్ సిసోదియా (దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం)ను జైలుకు పంపారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతా అటాచ్ చేశారు. టీఎంసీను ఇబ్బందిపెడుతున్నారు. తమిళనాడులో స్టాలిన్ మంత్రులను జైలుకు పంపారు. అందరినీ జైల్లో పెట్టండి. అప్పుడు ఒకే పార్టీ, ఒకే నాయకుడు మిగిలిపోతారు. కానీ ప్రజాస్వామ్యం మనుగడే ఉండదు. ఇలా జరగనివ్వకూడదు'' అని కేజ్రీవాల్ అన్నారు.

# భారత్ మసాల బ్రాండ్‌లపై మరో దేశం నిషేధం

- క్యాన్సర్ కారక పదార్థాలున్నాయనే ఆరోపణ
- ఇప్పటికే హాంకాంగ్, సింగపూర్, బ్రిటన్ దేశాల్లో బ్యాన్

**ముందడుగు జాతీయం:**

భారత్ వంటకాలల్లో మసాల పౌడర్లు అధికంగా వాడుతుంటారు. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలలపై తాజాగా మరో దేశం నిషేధం విధించింది. ఈ మసాల బ్రాండ్‌లపై ఇప్పటికే పలు దేశాలు నిషేధం విధించాయి. తాజాగా ఈ జాబితాలోకి మరో దేశం చేరింది. ఈ మసాలాల్లో క్యాన్సర్ కారక పధార్థాలున్నాయనే కారణంతో హాంకాంగ్, సింగపూర్, బ్రిటన్ దేశాలు ఇప్పటికే వీటిపై నిషేధం విధించాయి. ఇప్పుడు నేపాల్ కూడా ఈ మసాల బ్రాండ్‌లపై నిషేధం విధించింది. ఈ మసాలా దినుసుల్లో ఇథిలిన్ ఆక్సైడ్ ఉన్నట్లు వార్తలు రావడంతో నేపాల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మసాల బ్రాండ్‌ల దిగుమతులతో పాటు విక్రయాలు కూడా ఆపివేస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ తాము ఈ రెండు కంపెనీల మసాలాలను ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. ఈ మసాల దినుసులపై తుది నివేదిక వచ్చే వరకు వీటిని ఇక్కడ నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ దేశంతోపాటు సింగపూర్ కూడా ఎవరెస్ట్ మిక్స్ ను రీకాల్ చేయాలని ఆదేశించింది. ఇంకా న్యూజిలాండ్, యూఎస్, ఇండియా, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఆ రెండు మసాల బ్రాండ్ లకు సంబంధించిన సమస్యలను పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. బ్రిటన్ ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాలపై మే 16వ తేదీన నిషేదం విధించింది. ఈ మసాల బ్రాండ్‌లలో ప్రమాదకర రసాయనాలు ఉన్నాయా అనే కోణంలో వీటిపి దర్యాప్తు జరుగుతోందని, పూర్తి స్థాయి నివేదిక వచ్చే వరకు ఈ దినుసులపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది.



# వీసా లేకుంటే రష్యా పర్యటన.. ?

- చర్చలకు సిద్ధమవుతున్న భారత్, రష్యాలు
- ఈ ఏడాది చివరిలో ఖరారు అయ్యే అవకాశం



**ముందడుగు జాతీయం:**

ప్రపంచంలోని పలు దేశాలు తమ దేశాల్లో పర్యటక రంగాన్ని మరింత వృద్ధి చేసుకునేందుకు వీసా లేకుండానే విదేశీయులను పలు దేశాలు అనుమతిస్తున్నాయి. ఈ క్రమంలో వీసారహిత పర్యటనలను అనుమతించే విషయాన్ని చర్చించేందుకు భారత్, రష్యాలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు సంబంధించి ద్వైపాక్షిక ఒప్పందాల సాధ్యాసాధ్యాలపై జూన్‌లో తొలివిడత చర్చలు జరగనున్నాయి. ఈ ఏడాది చివరికి ఇరు దేశాల మధ్య ఒప్పందాలు ఖరారయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.


'వీసారహిత పర్యటన అనుమతుల్లో అంతర్గత సమన్వయం కోసం భారత బృందంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అవి తుది దశలో ఉన్నాయి. ప్రతిపాదిత ఒప్పందంపై త్వరలోనే చర్చిస్తాం. జూన్‌లోనే తొలిదశ చర్చలు నిర్వహిస్తాం. ఏడాది చివరికి ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది' అని రష్యా ఆర్థికాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన నికితా కొంద్రాత్యేవ్ పేర్కొన్నారు. విదేశీ పర్యటకులను ఆకర్షించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్న రష్యా.. ఇటు భారత్‌తోనూ వీసా రహిత బృంద ప్రవేశాలను అనుమతించాలనే ఉద్దేశాన్ని ఇటీవల వ్యక్తంచేసింది. ఇరు దేశాల పర్యటక, ఆర్థిక ప్రణాళికల్లో భాగంగా దీన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించింది.

## ప్రాణాంతకంగా మారిన
# హెపటైటిస్

- ప్రతిరోజు 3500 మంది ప్రాణాలు కోల్పోతున్నారు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న డబ్ల్యూహెచ్ఓ

**ముందడుగు జాతీయం:**

ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజు హెపటైటిస్ తో 3500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. హెపటైటిస్ పరీక్షలు, చికిత్సలు తగ్గడం వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. 2030 నాటికి హెపటైటిస్ ను పూర్తిగా నిర్మూలించాలనే డబ్ల్యూహెచ్ఓ లక్ష్యం పూర్తిగా ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసింది. 2024 గ్లోబల్ హెపటైటిస్ రిపోర్టు ప్రకారం.. 187 దేశాల్లో హెపటైటిస్ తో మరణాలు సంఖ్యం పెరిగిందని వెల్లడించింది. 2019లో 1.1 మిలియన్ల ప్రజలు ఈ వైరస్ తో మరణించగా.. ఆ సంఖ్య 2022లో 1.3 మిలియన్లకు చేరింది. ఇది టీబీ వ్యాధి మరణాలతో సమానం. ఈ మరణాల్లో హైపటైటిస్ బితో ఎక్కువ మంది చనిపోయినట్లు డబ్ల్యూహెచ్ఓ



ప్రకటించింది. 83 శాతం మంది హెపటైటిస్ బి తో మరణించినట్లు వెల్లడించింది. మిగతా మరణాల్లో హెపటైటిస్ సి వాటా ఉందని తెలిపింది. హెపటైటిస్ అనగా కాలేయానికి చెందిన వ్యాధి. ఇవి వైరస్, బాక్టీరియా, ప్రోటోజోవా, కొన్ని రకాల మందులు మొదలైన వివిధ కారణాల వలన కలుగుతుంది. వీటిలో వైరస్ వల్ల కలిగే హెపటైటిస్ ను వైరల్ హెపటైటిస్ అంటారు. వైరస్ నిర్ధారణలో ఆరోగ్య అధికారుల వైఫల్యాలను డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ ఘెబ్రేయేసస్ నివేదిక హైలైట్ చేసింది. హెపటైటిస్ ఇన్ఫెక్షన్‌లను నివారించడంలో ప్రపంచవ్యాప్తంగా పురోగతి ఉన్నప్పటికీ, హెపటైటిస్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న వ్యక్తులు మరణిస్తున్నారని తెలిపింది.హెపటైటిస్ నుంచి ప్రజలను రక్షించేందుకు మద్దతు ఇవ్వడానికి డబ్ల్యూహెచ్ఓ కట్టుబడి ఉందని వెల్లడించింది.

# సున్నితమైన శరీర భాగాలపై కొట్టారు

మొదటిపేజీ తరువాయి

పలుమార్లు కొట్టాడని ఆప్ ఎంపీ ఆరోపించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఢిల్లీ పోలీసు బృందం గురువారం మాలీవాల్ ఇంటికి వెళ్లి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా దాడి ఘటనను ఎంపీ పోలీసులకు వివరించారు. ''సీఎం నివాసంలో కూర్చున్న నా వద్దకు బిభవ్ వచ్చి దాడికి దిగాడు. 78 సార్లు చెంపపై కొట్టాడు. ఛాతి, కడుపుపై కాలితో తన్నాడు. ఏం జరుగుతుందో అర్థం కాక నేను షాక్‌కు గురయ్యా. సాయం కోసం అరిచా. నన్ను నేను రక్షించుకునేందుకు అతడిని నా కాళ్లతో బలంగా తోసేశా. పరిగెడుతుంటే నా చొక్క పట్టుకుని వెనక్కి లాగాడు. సున్నితమైన శరీర భాగాలపై పలుమార్లు కొట్టాడు. పొత్తి కడుపులో విపరీతమైన నొప్పితో నడవలేకపోయా. ఎలాగో తన నుంచి తప్పించుకుని బయటకు వచ్చి పోలీసులకు ఫోన్ చేశా'' అని స్వాతి వెల్లడించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

ముందడుగు
శనివారం, 18-5-2024, హైదరాబాద్

# చార్ ధామ్ యాత్రలో రీల్స్ చిత్రీకరణ నిషిద్ధం

## ఉత్తరాఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

**ముందడుగు ఉత్తరాఖండ్:**

ఇకపై చార్ ధామ్ యాత్రలోని ఆలయాల ప్రాంగణంలోని 50 మీటర్ల పరిధిలో వీడియోలు, రీళ్ల చిత్రీకరణపై నిషేధం ఉంటుందని ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాధా రాటూరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో రీల్స్ చేయడం భక్తులకు ఇబ్బందిగా మారిందని, వారి మత విశ్వాసాలను దెబ్బతీస్తోందని రాధా రాటూరి వ్యాఖ్యానించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సినిమా పాటలకు నృత్యాలు చేస్తున్న ఉదంతాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయని ఆమె అన్నారు. డెహ్రాడూన్‌లో చార్‌ధామ్ యాత్ర ఏర్పాట్లను పరిశీలించిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి పలువురు భక్తుల కోరికమేరకు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆమె తెలిపారు.



ప్రస్తుతం కొనసాగుతున్న చార్ ధామ్ యాత్రకు దేశ, విదేశాల నుంచి 26 లక్షల మంది భక్తులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. హరిద్వార్, రిషికేశ్‌లకు గతేడాదికంటే ఈసారి రెట్టింపు సంఖ్యలో భక్తులు వస్తున్నారని కమిషనర్ వినయ్‌శంకర్ పాండే తెలిపారు. మే 10న కేదార్‌నాథ్ ధామ్ తలుపులు తెరిచినప్పటినుంచి లక్ష మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 3 లక్షల మంది భక్తులు చార్ ధామ్‌ను సందర్శించారు. కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రితో సహా మూడు ధామ్‌లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే ఈ యాత్ర యమునోత్రి నుంచి మొదలై గంగోత్రి, కేదార్‌నాథ్ మీదుగా సాగుతూ బద్రీనాథ్ వద్ద ముగుస్తుంది.

# 16 రోజుల్లోనే దుర్గమ్మకు రూ.2.09 కోట్ల నగదు

## నగదుతో పాటు 434 గ్రాముల బంగారం, 4.145 కిలోల వెండి

**ముందడుగు విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం ఒకటి. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భారీ ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కేవలం 16 రోజుల్లోనే దుర్గమ్మకు రూ.2,09,49,116 కానుకల రూపంలో వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై వెలసిన అమ్మవారిని కేవలం 16 రోజుల్లోనే వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక, ఈ ఆలయ మహామండపం లోని ఆరో అంతస్తులో అమ్మవారి



హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించారు. ఈ కార్యక్రమం ఈవో కేఎస్ రామారావు, అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో జరిగింది. మొత్తం రూ.2.09కోట్లకు పైగా నగదును భక్తుల కానుకల రూపంలో అమ్మవారికి సమర్పించారు. నగదుతో పాటు 434 గ్రాముల బంగారం, 4.145 కిలోల వెండి కానుకల రూపంలో వచ్చాయి. వీటితో పాటు విదేశీ కరెన్సీ కూడా ఉంది. హుండీలలో యూఎస్ డాలర్లు 171, ఆస్ట్రేలియా డాలర్లు 115, అరబ్ ఎమిరేట్ దిర్హమ్స్ 105, సౌదీ రియాల్స్ 66, మలేషియా రింగెట్లు 50, కెనడా డాలర్లు 10, ఇంగ్లండ్ పౌండ్లు 5, కువైట్ దినార్ 1, బహరైన్ దినార్లు 3.5 ఉన్నాయి. వీటితోపాటు ఆన్‌లైన్ ఈహుండీ ద్వారా 45,01,0 కానుకలను కూడా భక్తులు సమర్పించుకున్నారు.

# విజయశాంతి బీఆర్ఎస్ వైపు చూస్తుందా..?

- గులాబీ పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు
- తాజా ట్వీట్‌తో రాములమ్మ అడుగులపై చర్చ

**ముందడుగు తెలంగాణ:**

కాంగ్రెస్ నేత విజయశాంతి చేసిన తాజా ట్వీట్ రాజకీయంగా కలకలం రేపుతోంది. బీజేపీ గులాబీ పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు విజయశాంతి స్పందించారు. విజయశాంతి తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారనే చర్చ మొదలైంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ విజయశాంతి ట్వీట్ చేసారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రాంతీయ పార్టీలే ఊపిరి అన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకునేవి కేవలం ప్రాంతీయ పార్టీలే అన్నారు. ప్రాంతీయ భావోద్వేగాలు, ప్రజల మనోభావాలు, వారి ఆత్మాభిమానం వైపు నడిపిస్తూనే వస్తుండడం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానంగా పేర్కొన్నారు. ఇది అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తున్న వారికి.. కరుణానిధి, ఎంజీఆర్, ఎన్టీఆర్, జయలలిత నుంచి ఇప్పుడున్న బీఆర్ఎస్, వైసీపీ సమాధానం అన్నారు. దీనిపై బీజేపీ విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



దక్షిణాది గురించి కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు.. బీజేపీ కనీసం ఆలోచన కూడా చేయట్లేదన్నారు. కిషన్‌రెడ్డి మాటలతో అది స్పష్టం అవుతోందన్నారు. విజయశాంతి ట్వీట్ పొలిటికల్ సర్కిల్లో చర్చకు దారి తీసింది. జాతీయ పార్టీలో ఉంటూ ప్రాంతీయ పార్టీలను పొగడటంపై డిస్కషన్ నడుస్తోంది. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి విజయశాంతి సైలెంట్‌గానే ఉన్నారు. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తారనే వార్తలు వినిపించినా.. కనీసం ప్రచారంలో కూడా పాల్గొనలేదు. కాంగ్రెస్‌లో రాములమ్మ అసంతృప్తిగా ఉన్నారని చర్చ ఉంది. ఈ సమయంలో విజయశాంతి చేసిన తాజా ట్వీట్‌తో రాములమ్మ అడుగులు ఎటు వైపు అనే చర్చ మొదలైంది.

# పాఠశాల డ్రైనేజీలో శవమై కనిపించిన బాలుడు

## పాఠశాలను తగలపెట్టిన బాలుడి కుటుంబ సభ్యులు

**ముందడుగు బీహార్:**


మూడేళ్ల బాలుడు పాఠశాల డ్రైనేజీలో శవమై కనిపించాడు. దీంతో ఆగ్రహానికి గురైన బాలుడి కుటుంబ సభ్యులు పాఠశాలకు నిప్పు పెట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ దారుణ సంఘటన బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగింది. పాఠశాలకు వెళ్లిన మూడేళ్ల బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి చిన్నారి ఆచూకీ కోసం గాలించారు. బాలుడి అదృశ్యంపై పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అయితే, వారు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అనుమాన పడ్డ బాలుడి కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో తీవ్రంగా గాలింపు చేపట్టారు. అక్కడ లోతైన డ్రైనేజీ గుంతలో బాలుడి మృతదేహం కనిపించింది. దీంతో ఆగ్రహానికి గురైన బాధితులు పాఠశాలకు నిప్పు పెట్టారు. తమకు న్యాయం చేయాలంటూ స్థానికులతో కలిసి




రోడ్డెక్కారు. అనేక వాహనాలకు నిప్పు పెట్టారు. పాఠశాలకు వెళ్లే రహదారులను కూడా దిగ్బంధించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అయితే, చిన్నారి పాఠశాలలోకి ప్రవేశిస్తున్నట్లు ఉంది కానీ, బయటకు వెళ్లడం కనిపించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పాట్నా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్ర ప్రకాశ్ తెలిపారు.

# అన్నదమ్ముల ప్రాణాలు తీసిన భూవివాదం

## ఇంటి రహదారి విషయంలో గొడవ



**ముందడుగు జగిత్యాల:**

ఇంటి రహదారి విషయంలో జరిగిన భూ తగాదాల గొడవ కారణంగా ఓ కుటుంబంలో విషాదం నింపింది. ఇద్దరు అన్నదమ్ముల కుమారులు మృతి చెందడంతో జగిత్యాల జిల్లా గోపులాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన దివిటి శ్రీనివాస్ రెండేళ్ల క్రితం తన ఇంటి పక్కనే మరో ఇంటిని కొనుగోలు చేశాడు. దాని పక్కనే అదే గ్రామానికి చెందిన బుర్రా నవీన్ ఇల్లు కూడా ఉంది. దీంతో ఇంటి రహదారి విషయంలో నవీన్, శ్రీనివాస్‌కు తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి శ్రీనివాస్, నవీన్ కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవ జరిగి సద్దుమణిగింది. అనంతరం శ్రీనివాస్ తన పెదనాన్న కుమారుడు మహేష్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరు మాట్లాడుకుంటుండగా.. నవీన్ కొంతమంది యువకులను తీసుకొచ్చి.. శ్రీనివాస్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాస్(36) అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డువచ్చిన మహేష్‌పై కూడా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్‌కు కుమారుడు, భార్య ఉన్నారు. శ్రీనివాస్ సోదరి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని అదనపు ఎస్పీ వినోద్ కుమార్ పరిశీలించారు.

ముందడుగు
శనివారం, 18-5-2024, హైదరాబాద్





## ఎంపీ అభ్యర్థి ఆస్తి
# కేవలం రూ.2 మాత్రమే
### అఫిడవిట్‌లో వెల్లడించిన అభ్యర్థి రణ్‌ధీర్ సింగ్

**ముందడుగు హర్యానా:** దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో హర్యానా రాష్ట్రంలోని రోహ్‌తక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆ అభ్యర్థి ఆస్తి కేవలం రూ.2 మాత్రమేనని ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపారు. ఈ స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న మాస్టర్ రణ్‌ధీర్ సింగ్.. అత్యల్ప ఆదాయం కలిగిన ఎంపీ అభ్యర్థిగా నిలిచారు. ప్రస్తుతం ఆరో విడత ఎన్నికలకు సంబంధించి ఇటీవలె అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ ఆరో విడత పోలింగ్ ఈ నెల 25 వ తేదీన జరగనుంది. ఈ ఆరో దశలో మొత్తం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న 57 స్థానాలకు 869 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ మేరకు ఈ ఆరో విడతలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన వివరాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ఏడీఆర్ వెల్లడించింది.




# లంకాపేకు ఫోన్‌పే సహకారం

**ముందడుగు హైదరాబాద్:** పొరుగు దేశమైన శ్రీలంకలో యూపీఐ పేమెంట్లను ప్రోత్సహించడం కోసం లంకాపేకు తమ సహకారాన్ని అందిస్తున్నట్లు ఫోన్‌పే నేడు ప్రకటించింది. లంకా క్యూఆర్ మర్చంట్ పాయింట్లు అన్నింటిలోనూ ఇకపై యూపీఐ పేమెంట్లను అంగీకారం లభిస్తుందని కొలంబోలో జరిగిన కార్యక్రమంలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా మాట్లాడుతూ భారత్, శ్రీలంకల మధ్య సంబంధాన్ని మెరుగుపర్చడంలో ఈ ఫిన్‌టెక్ అనుసంధానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీలంక సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ డాక్టర్ నందలాల్ వీరసింఘే ప్రసంగిస్తూ, ఈ పరస్పర సహకార సామర్థ్యం వల్ల కొత్త అవకాశాలు అందరికీ అందుబాటులో వస్తాయని, దీని వల్ల పోటీతత్వం పెరిగి శ్రీలంక వ్యాపారులకు ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

లంకాపే సీఈఓ ఛన్నా డి సిల్వా కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడారు. 'శ్రీలంకలో డిజిటల్ పేమెంట్ల భవిష్యత్తు: శ్రీలంకలో వ్యాపారాలకు అవకాశాలు' అనే అంశంపై ఆలోచింపజేసే ప్యానెల్ చర్చను నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక వ్యాపారాలకు ఉన్న అవకాశాలు, అలాగే అభివృద్ధి మార్గాలపై చర్చించారు.






# అందాల డాక్టరమ్మ..!

- మిసెస్ ఇండియా గ్లోబల్ కిరీటం కైవసం
- మిసెస్ ఇండియా తెలంగాణ సొంతం
- డాక్టర్ గాధిరాజు స్రవంతిపై ముందడుగు కథనం



**నిజానికి వైద్యులు చాలా బిజీబిజీగా గడుపుతారు.. రోగులు, చికిత్స, ఆపరేషన్స్ అంటూ తీరిక లేకుండా ఉంటారు. వైద్యులు నిజానికి తమ కుటుంబ సభ్యులకు కూడా సరియైన సమయం ఇవ్వరు. అలాంటిది కొంతమంది డాక్టర్స్ మాత్రం వారికీ ఉన్న సమయాన్ని బేరీజు వేసుకుంటూ సామాజిక సేవ చేస్తుంటారు. సామాజిక సేవతో పాటు అందాల పోటీల్లో రాణిస్తున్న డాక్టర్ గాధిరాజు స్రవంతి గురించి ఒకసారి తెలుసుకుందాం..**

**ముందడుగు ప్రత్యేకం:** డాక్టర్ స్రవంతి గాధిరాజు వైద్య రంగంలో ఔన్నత్యానికి, కరుణకు పెట్టింది పేరు. OBG, FMAS, DMAS మరియు FICOGలో MSతో సహా అనేక అర్హతలు సంపాదించారు. ఆమె కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ మరియు ప్రసూతి వైద్యురాలు, అంతేకాకుండా లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ సర్జన్ వంధ్యత్వ చికిత్సలో నిపుణురాలు. గైనక్ ఆంకాలజీలో అంతర్జాతీయ ఫెలోషిప్‌తో ఆమె తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

## సేవా రంగం వైపు అడుగులు

గైనకాలజిస్ట్ విభాగంలో ఎంతో బిజీబిజీగా ఉండే స్రవంతి, వైద్యవృత్తియే కాకుండా సామాజిక సేవ రంగాలతో పాటు అందాల పోటీలు తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకుంది. వయస్సు అనేది ఒక నెంబర్ మాత్రమే అని చెపుతూ, మనసు నిత్యం ఉల్లాసంగా ఉండడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరం అంటుంది. హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ గైనిక్ అంకాలజిస్టు డాక్టర్ స్రవంతి గాధిరాజుకు మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్ అనే ప్రతిష్టాత్మక బిరుదు లభించింది. మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేత అయినా డాక్టర్ గాధిరాజు జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించారు. మార్చి 30, 2024న గురుగ్రామ్‌లో అందాల కిరీటంతో సత్కరించబడ్డారు.

## ఎంతోమందికి ఆసరాగా

డాక్టర్ స్రవంతి వృత్తి, సేవలు వైద్య రంగానికి మించి విస్తరిస్తున్నాయి. ఆమె వైద్య సేవా రత్న అవార్డు, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం మెడికల్ ఎక్సలెన్స్ అవార్డ్, డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డు, హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డు మరియు కోవిడ్ వారియర్ అవార్డు ఇలా ఎన్నో సత్కారాలు పొందారు. గత 15 సంవత్సరాలుగా రోగుల పట్ల ఆమెకున్న అచంచలమైన నిబద్ధత మరియు నిస్వార్థ సామాజిక సేవే ఆమెకు అంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. వికలాంగుల (చెవిటి మరియు మూగ) పిల్లలతో సహా పిల్లలను దత్తత తీసుకోవడం నుండి, వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం, ఉచిత వైద్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు మరియు గిరిజన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య దిశానిర్దేశం మరియు అవగాహన కార్యక్రమాలు నిత్యం కొనసాగిస్తున్నారు.

## సేవలోనే నాకు ఆనందం

ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. దేశం యొక్క సంస్కృతి, సంప్రదాయాలు మరియు విలువలను ప్రచారం చేసే అవకాశం వచ్చిందన్నారు. భారతదేశాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి మరియు ప్రేమ మరియు శాంతికి నిర్వచనమని చెపుతూ, మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, తన వంతు ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి కృషి చేస్తానని అన్నారు. సేవ అనేది తన జీవితంలో ప్రధాన భాగం అన్నారు. తన సమయం చాలా బిజీ అని తెలిసినా కానీ తనకు ఉల్లాసం, ఉత్సహం మాత్రం సేవారంగంలోనే దొరుకుతుందని డాక్టర్ గాధిరాజు స్రవంతి అంటున్నారు.

